క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే అభినందనలు



పంచాయతీ సెక్రటరీ దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: స్వాతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ సేవా పురస్కారం పొందిన రావులపాలెం పంచాయతీ సెక్రటరీ ఎల్.దుర్గాప్రసాద్‌ను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. మండలంలోని గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో దుర్గాప్రసాద్‌కు శాలువా వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే రావులపాలెం సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు కార్యదర్శి దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

విద్యార్థినులకు యూనిఫాం అందజేత



అంబాజీపేటలో దాతలు అందించిన యూనిఫాంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల విద్యార్థినులకు పలువురు దాతలు యూనిఫాం బుధవారం అందజేసినట్లు హెచ్‌ఎం కె.సాయిరామ్ తెలిపారు. స్థానికులు మేడిది రంగా జానకీ ప్రసాద్ (చిన్న), పళ్ల శ్రీనివాస్, కుప్పాల సీతారం, పేపకాయల వీవీ సత్యనారాయణలు 23 మంది విద్యార్థినులకు రెండు జతల యూనిఫాం బహూకరించారన్నారు. ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి దాతలు కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆత్మా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన రోగి నక్కా వినోద్ కుమార్‌కు, స్థానిక రత్న చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందింది. అనారోగ్యంతో బాధపడుతున్న వినోద్ కుమార్‌కు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా పై మొత్తాన్ని అందజేశారు. వినోద్ కుమార్ పరిస్థితి తెలుసుకున్న ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొల్ల విజయ్‌ప్రకాష్ పై మొత్తాన్ని సమకూర్చారు. వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

35 మందికి కంటి పరీక్షలు

కొత్తపేట: మండలంలోని మందపల్లిలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు పరీక్ష శిబిరం నిర్వహించారు. పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ధర్మవరపు కోటేశ్వరరావు కంటి పరీక్షలు నిర్వహించారు. 35 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 20 మందికి కళ్లజోళ్లు వేయడానికి, ముగ్గురికి కాటరాక్ట్ ఆపరేషన్‌కు గుర్తించారు. ఏఎన్‌ఎం అరుణకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ విజయశ్రీ, ఆశ వర్కర్ దుర్గ, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అయ్యాజీవేమా

పి.గన్నవరం: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. పార్టీ నాయకుడు తిక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో మండలంలోని బెల్లంపూడిలో బుధవారం వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి వేమా తదితరులు పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ నాయకులు చీకరమెల్లి శ్రీనివాసరావు, గొలకోటి సూర్యనారాయణ, వర్దినీడి సాయి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

మలికిపురం: మండలంలోని విద్యుత్ వినియోగదారులంతా పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లులు, ఏ సీ డీ బిల్లులు, అడిషనల్ లోడ్ బిల్లులు, నెలకి 200 యూనిట్లు దాటి విద్యుత్ వాడుతున్న ఈ–సర్వీసుల బిల్లులు అన్నీ వెంటనే చెల్లించాలని ఏఈ మద్దూరి సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేనిచో 17వ తేదీ శుక్రవారం విద్యుత్ శాఖ సిబ్బంది తనిఖీలు నిర్వహించి ఏ విధమైన బకాయిలు ఉన్నను వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆయన పేర్కొన్నారు.

కొత్తపేట: మండలంలోని విద్యుత్ వినియోగదారులు అందరూ పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లులు, ఏ సీ డీ బిల్లులు, అడిషనల్ లోడ్ బిల్లులు, నెలకు 200 యూనిట్లు దాటి విద్యుత్ వాడుతున్న ఎస్సీ సర్వీసుల బిల్లులు వెంటనే చెల్లించాలని అమలాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు.

ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం

- పచ్చని కూరగాయల్లో విటమిన్లు పుష్కలం
- కోవిడ్ తరువాత పెరిగిన డిమాండ్



ఆకు కూరలు



తోటకూర వేపుడు

ఆలమూరు: కోవిడ్–19 తరువాత ప్రజలకు ఆహారపు అలవాట్లలో విపరీతమైన మార్పులు వచ్చాయి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ దానికనుగుణంగా ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. సరికొత్తగా జీవన విధానాన్ని అలవర్చుకుని 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నానుడికి జీవం పోస్తున్నారు. మాంసాహారం, పప్పుదినుసులతో పాటు తేలికపాటి ఆహారంగా భావించే ఆకుకూరలను విరివిగా ఉపయోగిస్తున్నారు. ధర తక్కువ, పోషకాలు ఎక్కువగా ఉండే ఆకుకూరలు కొనుగోలు చేయడానికి అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి కనబర్చుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పట్టణ ప్రాంతాలతో పోటీగా గ్రామీణ ప్రాంతాలలో కూడా ఆకుకూరల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. కొవ్వులు ఎక్కువగా ఉండే మాంసాహారాన్ని తీసుకుని రోగాలను కొనితెచ్చుకోవడం కంటే పోషక విలువలు, పలురకాల విటమిన్లు కలిగిన ఆకుకూరలు ఎక్కువగా తినడం మంచిదని వైద్యులు సూచించడం కూడా వినియోగం పెరగడానికి కారణమవుతోంది.

ఆకుకూరల్లో పుష్కలంగా పోషక విలువలు

తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర, పుదీనా, మెంతికూర, కొత్తిమీర, కరివేపాకు తదితర ఆకుకూరలు అనునిత్యం అందుబాటు ధరల్లో మార్కెట్లో లభిస్తున్నాయి. ప్రస్తుత వర్షాకాలం సీజన్ కొనసాగుతుండటంతో పొన్నగంటి కూర, బచ్చలి కూర ఎక్కువ మొత్తంలో మార్కెట్‌కు వస్తున్నాయి. ఆకుకూరల్లో ఏ, సీ, బీ కాంప్లెక్స్ విటమిన్లు, మెగ్నీషియం, ఐరన్, కాల్షియం, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు ఉంటాయి. రోగ నిరోధక శక్తి పెరుగుదలకు, ఎముకల్లో కాల్షియం సాంద్రత పెంచేందుకు, ఊబకాయం తగ్గించేందుకు, రక్తహీనత నివారణకు ఆకుకూరలు ఉపయోగించాలని వైద్యులు చెబుతున్నారు. ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా లభించే విటమిన్ల వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. రోజా రావులపాలెం, మడికి మార్కెట్లకు టన్ను కూరగాయలు దిగుమతి అవుతున్నట్టు మార్కెట్‌కు చెందిన వ్యాపారులు తెలిపారు.

అపోహలు వద్దంటున్న వైద్య నిపుణులు

కొన్ని రకాల ఆకుకూరలు తింటే అనారోగ్యాలు కలుగుతాయన్న అపోహలను పరిగణనలోకి తీసుకోవద్దని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆ సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేస్తున్నారు. గోంగూర తింటే వేడి చేస్తుందని, కీళ్ల నొప్పులు, వాతం వస్తాయని, పాలకూర, తింటే కిడ్నీలో రాళ్లు పెరుగుతాయనే భావన నిజం కాదంటున్నారు. పాలకూరలో కాల్షియం ఎక్కువగా ఉండడం వల్ల కిడ్నీలో రాళ్లతో బాధపడే వారు దీన్ని తింటే నొప్పి పెరిగే అవకాశం ఉందనేది అపోహ మాత్రమేనంటున్నారు. పాలకూర తిన్నా ఎక్కువగా మంచినీళ్లు తాగితే దాని ప్రభావం ఉండదని చెబుతున్నారు. ఆకుకూరలను తినడం ద్వారా మేలు ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

పోషక విలువలు అత్యధికం



పచ్చని ఆకుకూరల్లో విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ఆకుకూరలను ఎక్కువగా ఉడికించకుండా తింటే మంచిది. కంటి జబ్బులు, రక్తహీనత తదితర రోగాలను దూరం చేయవచ్చు. చక్కెర వ్యాధిగ్రస్తులు ఆకుకూరలు తీసుకుంటే వ్యాధి నియంత్రణలో ఉంటుంది.

– ఆర్.సుదర్శన్‌బాబు, వైద్యాధికారి, పెదపళ్ల పీహెచ్‌సీ

ఆరోగ్యానికి దోహదం



కరోనా వైరస్ విస్తృతంగా ఉన్న సమయంలో అత్యధిక పోషకాలు ఉన్న ఆకుకూరలను ఆహారంగా తీసుకుంటున్నాం. వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుండటంతో పాటు మెరుగైన ఆరోగ్యానికి ఆకుకూరలు సహకరిస్తాయి.

– బి.కుమారి, ఆలమూరు

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంకలో బుధవారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. స్థానిక కొబ్బరి దింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దింపు కార్మికుల చిన్నారులు కూడా పాల్గొని లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రతి ఇంటిలోనూ లచ్చన్న చిత్రపటం ఉంచాలని ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంఘ సభ్యులు నిర్ణయించారు. సింహాద్రి కొబ్బరి దింపు కార్మికుల జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుర్తి పాండురంగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గండిబోయిన శ్రీనివాస్, అండిబోయిన చిన్న బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: స్వాతంత్ర్య సమరయోధుడిగా, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, ఐక్యతకు ఎంతగానో పాటుపడిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. గౌతు లచ్చన్న జయంతి పురస్కరించుకుని స్థానిక ఆర్ఎస్ కన్వెన్షన్ హాలు వద్ద లచ్చన్న విగ్రహానికి రెడ్డి సుబ్రహ్మణ్యం, పలువురు బీసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత కులస్తులందరూ ఒక్కటేనని, వారందరినీ ఒకే తాటిపై నడిపించేందుకు గౌతు లచ్చన్న ఎంతో కృషి చేశారన్నారు. అంతా కలిసి కట్టుగా రాజ్యాధికారం సాధించాలని ఆశించిన ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుడు మట్టపర్తి సూర్యచంద్రరావు, మండల శెట్టిబలిజ సంఘం గౌరవాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, అధ్యక్షుడు కముజు వెంకటేశ్వరరావు, వివిధ పార్టీలకు చెందిన సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



కొత్తపేటలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న రిటైర్డ్ బీఎం సూర్యప్రకాశరావు

కొత్తపేట: ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఉత్తమ ఫలితాల ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ) రిటైర్డ్ బీఎం రాయుడు సూర్యప్రకాశరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆ కళాశాల ప్రప్రథమ బ్యాచ్ (1969) విద్యార్థులు రూ.3 లక్షల నిధి డిపాజిట్ చేశారు. ఆ నిధి నుంచి వచ్చే వడ్డీని ఏటా ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులుగా అందజేస్తున్నారు. ఆ మేరకు 2022–23 సంవత్సరం కళాశాల ద్వితీయ సంవత్సరం కముజు సత్యప్రియాంక (ఎంపీసీ), ఉంగరాల భాస్కరశివహనుమాన్ (బైపీసీ), వాసంశెట్టి లక్ష్మీదుర్గ (సీఈసీ), బొక్కా కిషోర్ (హెచ్ఈసీ) ఉత్తమ ఫలితాలతో టాపర్స్‌గా నిలిచారు. ఉత్తమ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.6,750 చొప్పున సూర్యప్రకాశరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలకరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..



గోగన్నమఠంలో ప్రజలకు బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: అవినీతి, అక్రమాలకు తావు లేని పారదర్శకమైన పాలన అందిస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. గోగన్నమఠంలో పార్టీ సీనియర్ నాయకుడు భూపతిరాజు సత్తిబాబురాజు ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రజలను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు వింటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు వెళ్తున్నారని చెప్పారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు ఎంతో దగ్గర చేశారని చెప్పారు. ఎవరూ ఊహించని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని వరప్రసాదరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పీఏసీఎస్ చైర్మన్లు సాగి పీఈఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్య, గ్రామశాఖ అధ్యక్షుడు సాగి సత్యనారాయణరాజు, పార్టీ నేతలు కేఎస్ఎన్ రాజు, కుసుమ శ్రీధర్, సూరిశెట్టి బాబి, ముత్యాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కొత్తపేటలో యానిమేటర్లకు యూనిఫాం, చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి మహిళల ఆర్థికాభివృద్ధి సాధించాలనే సీఎం జగన్ ప్రభుత్వ లక్ష్యం మేరకు డ్వాక్రా యానిమేటర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు సూచించారు. మండలంలోని డ్వాక్రా యానిమేటర్లు స్వచ్ఛందంగా యూనిఫాం ధరించి విధులు నిర్వర్తించాలనే నిర్ణయం మేరకు ఎంపీపీ గంగాధరరావు మండలంలో మొత్తం 62 మందికి చీరలు సమకూర్చారు. బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం స్త్రీ శక్తి భవనంలో వాటిని పంపిణీ చేశారు. జరిగిన సభకు మండల సమాఖ్య అధ్యక్షురాలు గుబ్బల అర్జావతి అధ్యక్షత వహించగా ఎంపీపీ మార్గన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల సమాఖ్య ప్రగతిపై సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాక డ్వాక్రా వ్యవస్థలో మహిళా సంఘాలకు చేదోడు వాదోడుగా పని చేస్తున్న యానిమేటర్లకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించారన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి లక్ష్యం మేరకు యానిమేటర్లు అందరూ చిత్తశుద్ధితో పనిచేసి మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఏపీఎం పి.విశ్వనాథం, సీసీ పైడిరాజు, అకౌంటెంట్ కె.దుర్గ, డ్వాక్రా యూనియన్ ప్రెసిడెంట్ పి.నాగజ్యోతి, సెక్రటరీ ఎం.వరలక్ష్మి, ట్రెజరర్ కె.పద్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ హయాంలోనే ఇంటింటికీ కుళాయి



గొల్లపాలెంలో పైప్‌లైన్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి పైప్ లైన్ వేశామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెంలో గంటా వారి గ్రూపునకు రూ.6 లక్షలతో తాగునీటి పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో రాజోలు నియోజక వర్గంలో తాగునీటి పనులకు రూ.కోట్లలో ఖర్చు చేశామన్నారు. అంతర్వేదిలో కూడా భారీ ప్రాజెక్టుకు భూమి పూజ చేశామని త్వరలోనే ఆ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే తీర గ్రామాల్లో ఇక తాగునీటి సమస్య ఉండదన్నారు. గత ప్రభుత్వాలు అరకొర నిధులు ఇవ్వడంతో ప్రజలు తాగునీటికి అల్లాడేవారని ఎమ్మెల్యే అన్నారు. చుట్టూ ఉప్పునీరు ఉన్న రాజోలు దీవిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం హయాంలో నీటి ఎద్దడి తప్పిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్ట అనంతలక్ష్మి, మాజీ ఎంపీటీసీ గుండుమేను నారాయణమూర్తి, కందుల విజయకుమార్, గుండుమేను శ్రీనివాస్ యాదవ్, పితాని శ్రీను, బాలం నాగేశ్వరరావు, గెద్దం డానియేల్, గంటా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

సఖినేటిపల్లి: సీఎం జగన్ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం గొందిలో నూతన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించి, భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అయ్యాయని ఎమ్మెల్యే రాపాక తెలిపారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీలు రాపాక దీవెన కుమారి, రుద్రరాజు చినరాజా, సర్పంచ్ దొండపాటి రవికుమార్, ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, ఎంపీడీవో జి.భీమారావు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: దాతలు అందించిన ప్రోత్సాహాన్ని, సహకారాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ చైర్మన్ బొంతు శ్రీనివాస్‌లు అన్నారు. ఇసుకపూడిలో మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు సమకూర్చిన విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను హెచ్‌ఎం ఏఎల్ వరప్రసాద్ అధ్యక్షతన బుధవారం పంపిణీ చేశారు. వాటితో పాటు రివాల్వింగ్ చైర్, విద్యార్థుల బహుమతుల నిమిత్తం రూ.30 వేలు అందజేశారని హెచ్‌ఎం తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన సుంకర అచ్యుత రామయ్య (ఏసు) రూ.10 వేలు విలువైన కుర్చీలను ఉపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోట విజయరాజు, పీఎంసీ చైర్మన్ కాకర భీమరాజు, ఉప సర్పంచ్ బండారు దుర్గాదేవి, పళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామికి బుధవారం ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో విశేషపూజలు జరిపారు. స్వామికి పంచామృతాభిషేకం, ఏకవార, లఘున్యాస, రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో నిత్యగణపతిహోమం నిర్వహించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి నిత్యాన్నదానంలో అధిక సంఖ్యలో స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సంక్షేమ సారథులకు బీమా సౌకర్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

పి.గన్నవరం: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు, పార్టీకి సేవలు అందిస్తున్న మండల జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సీఎం జగన్ ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చాకలిపాలెంలో కృష్ణబాలాజీ కన్వెన్షన్ హాలులో బుధవారం నియోజకవర్గ స్థాయిలో ఉచిత బీమా కోసం నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి వచ్చే నెల 10 వరకూ గ్రామ సచివాలయాల్లో నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్న ప్రభుత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కిందని చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరం, తుని నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు పెనుమత్స చిట్టిరాజు, చెల్లుబోయిన శ్రీనులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని మరింత పటిష్టం చేసి, మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మి, కశిరెడ్డి అంజిబాబు, మండల శాఖల అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, వాసంశెట్టి చినబాబు, కొమ్ముల రాము, మట్టపర్తి శ్రీను, మండల జేసీఎస్ కన్వీనర్లు దొమ్మేటి దుర్గారావు, జక్కంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి ఉపాలయం వద్ద రానున్న నిజ శ్రావణమాసంలోని ఐదు శుక్రవారాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ బుధవారం చెప్పారు. ఈ నెలలో 18, 25 తేదీల్లో వచ్చే శుక్రవారాలకు, సెప్టెంబర్ నెలలో వచ్చే 1, 8, 15 శుక్రవారాలకు ఎటువంటి పూజా రుసుం లేకుండా మహిళలు పాల్గొనవచ్చన్నారు. అమ్మవారి రూపు, పూజా సామగ్రి, ప్రసాదం దేవస్థానం నందు దాతల సహకారంతో ఉచితంగా పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. నిజ శ్రావణంలో వచ్చే ప్రతి శుక్రవారం దేవస్థానం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని మహిళలు పూర్తిగా సద్వినియోగం చేసుకుని, అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

గడువులోగా ఓటర్ల సర్వే పూర్తి చేయాలి

అంబాజీపేట: ఓటర్ల జాబితా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి చేపట్టిన సర్వేను గడువులోగా పూర్తి చేయాలని తహసీల్దార్ టి.మంగతాయారు ఆదేశించారు. బీఎల్వోలకు బుధవారం పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే సకాలంలో పూర్తి చేసేలా బీఎల్వోలు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. జాబితాలో తప్పులను సవరించడంతో పాటు నూతన ఓటర్లను చేర్చడం, మరణాలను గుర్తించి వాటి వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు సర్వే పారదర్శకంగా చేయాలన్నారు.

శాస్త్ర సాంకేతిక అభివృద్ధిపై ఆసక్తి పెంచాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఈఓ కమలకుమారి

రాజోలు: విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక అభివృద్ధిపై ఆసక్తి పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి అన్నారు. బుధవారం రాజోలు బాలికోన్నత పాఠశాలలో హిరోషిమా, నాగసాకి డే పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రపంచశాంతి, శాస్త్రీయ దృక్పథంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పలువురు సూచించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సమన్వయకర్త జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయిని సుహాసిని, ఎంఈఓ నల్లి మనోహర్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలి

ఆత్రేయపురం: గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ నాతి బుజ్జి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో వైద్యసేవలను పర్యవేక్షించారు.